క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే వనమా



ప్రియాంకకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వనమా

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలాను కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు శుక్రవారం ఐడీఓసీలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కంచర్ల చంద్రశేఖర్‌రావు, కొత్వాల శ్రీనివాసరావు, బరపటి వాసు, కాపు సీతాలక్ష్మిపాల్గొన్నారు.

ప్రభుత్వమే వేతనాలు అందించాలి

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వాస్పత్రుల్లో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా వేతనాలు అందజేయాలని కోరుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ యూనియన్, భారత రాష్ట్ర సమితి ట్రేడ్ యూనియన్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ కుమార్ స్వామికి వినతిపత్రం అందజేశారు. రజనీకాంత్ బండారి, మాతంగి రాజేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

జూలూరుపాడు: పడమటనర్సాపురం గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు జంజీరాల విజయకుమార్ కొంతకాలంగా క్యాన్సర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామీణ వైద్యులు శుక్రవారం విజయకుమార్‌ను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.22,000 అందించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఇల్లెందురూరల్: పరిశుభ్రత పాటించి ఆరోగ్యవంతులుగా ఉండాలని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లోహిత సూచించారు. ఒడ్డుగూడెం గ్రామపంచాయతీ చెన్నంగలగడ్డ ఆశ్రమ పాఠశాలలో వంటగది, పరిసరాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. కళ్లకలకతో బాధపడుతున్న విద్యార్థులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం ఒడ్డుగూడెం సబ్ సెంటర్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు.

గ్రామాల్లో డీఎల్‌పీఓ పర్యటన

టేకులపల్లి: డీఎల్‌పీఓ రాజీవ్ కుమార్ శుక్రవారం మండలంలో పర్యటించారు. దాసుతండా, చుక్కాలబోడు, పెట్రాంచెలక, కుంటల్ల, ఎర్రాయిగూడెం, బోడు, రామచంద్రునిపేట పంచాయతీలను సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. కార్యదర్శుల పనితీరుని పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు.

సింగరేణి డైరెక్టర్‌ను కలిసిన ఎడవల్లి కృష్ణ



మొక్క అందజేస్తున్న ఎడవల్లి

కొత్తగూడెంరూరల్: సింగరేణి డైరెక్టర్(పా) బలరాం నాయక్‌ను టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎడవల్లి బలరాం నాయక్‌కు మొక్కను అందజేశారు. అంతోటి పాల్, బత్తుల వెంకటేశ్వరరావు, కొండం వెంకన్న గౌడ్, పసుపులేటి వీరబాబు, ఫ్రాన్సిస్, సైదుబాబు, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్సుల తనిఖీ

ఇల్లెందు: ఏరియాలోని 108, 102, 1962 అంబులెన్సులను ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేంద్ర, జిల్లా ఫ్లీట్ కో–ఆర్డినేటర్ సాయి కిరణ్ శుక్రవారం తనిఖీ చేశారు. ఇల్లెందులోని ప్రభుత్వాస్పత్రిలో గత ఏడాది ప్రారంభించిన 108 అంబులెన్సులు ఏడాది పూర్తి చేసుకున్నందున తనిఖీ చేసి తగు సూచనలు చేశారు. ఏఎఫ్ఈ మధుకర్‌రెడ్డి, అన్ని అంబులెన్సుల ఉద్యోగులు పాల్గొన్నారు.

కేసు నమోదు

ఇల్లెందురూరల్: 21పిట్ ఏరియాలో భూకబ్జాకు యత్నించి బెదిరింపులకు పాల్పడిన విషయంలో నలుగురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవూఫ్ తెలిపారు. ప్రధాన రహదారి వెంట తమకు ఉన్న ఐదు గుంటల స్థలాన్ని ముస్తఫా, జుబేద్, సిరోజ్, శ్రీను ఆక్రమించేందుకు యత్నించడంతోపాటు దుర్భాషలాడుతూ బెదిరిస్తున్నారని కుందెన కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆలయంలో చోరీ

కొత్తగూడెంటౌన్: పెనగడప గ్రామంలోని అమ్మవారి ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. అమ్మవారి ఆలయంలో అరతులం బంగారం, రూ.10 వేలు, పుస్తెలతాడు, వెండి గ్లాసులు చోరీకి గురయ్యాయి. ఈ సంఘటనపై స్థానికుల సమాచారం మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గృహ‘లక్ష్మి’ కటాక్షించేనా..?

- ముగిసిన దరఖాస్తు గడువు
- మండలంలో మొత్తం 2,345 దరఖాస్తులు



గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు అందజేస్తున్న మహిళలు (ఫైల్)

సుజాతనగర్: మండల వ్యాప్తంగా గూడు లేని వేలాదిమంది పేదలు సొంతింటి కల నెరవేరుతుందేమోనని ఎదురుచూస్తున్నారు. ఎన్నికల సీజన్ కావడంతో రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాలకు చేరువయ్యేందుకు ప్రజాకర్షక పథకాలను అమలు చేస్తోంది. ఇప్పటికే దళితబంధు, బీసీ బంధులకు రూ.లక్ష ప్రకటించగా.. తాజాగా గృహలక్ష్మి పేరుతో నిరుపేదలకు గృహయోగం కల్పించాలని నిర్ణయించింది.

డబుల్ బెడ్ రూం కోసం ఎదురుచూసి..

గత ప్రభుత్వాల హయాంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు మినహా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు ఇంత వరకు పక్కా ఇళ్లు ఇవ్వలేదు. నాలుగైదేళ్లుగా డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం వందలాది మంది పేదలు దరఖాస్తు చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేపట్టినప్పటికీ ఆశించిన స్థాయిలో విజయవంతం కాలేదు. సుజాతనగర్, గరీబ్‌పేట రెండు గ్రామాల్లో కలిపి మొత్తం 30 మందికే డబుల్ బెడ్ రూం ఇళ్లు దక్కాయి. ఇంటి నిర్మాణ ఖర్చులు ఆకాశాన్ని అంటుతున్న నేటి సమయంలో పేదలు సొంతగా ఇంటి నిర్మాణం చేయాలంటే కాని పని. ఈ నేపథ్యంలో సొంత స్థలం ఉన్న నిరుపేదలు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షల సాయాన్ని అందించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. మూడు విడతల్లో విడతకు రూ.లక్ష చొప్పున అందించనుంది.

మూడు రోజుల్లో 2,345 దరఖాస్తులు...

ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న పేదలకు గృహలక్ష్మి పథకంతో ఊరట కలగనుంది. సొంత స్థలం ఉండి, ఇల్లు నిర్మించుకోవాలనుకునే పేదలు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం చెప్పడంతో ఈ నెల 8,9,10 తేదీల్లో దరఖాస్తులను స్వీకరించారు. మండలంలో పేద, మధ్య తరగతి కుటుంబాలన్నీ దాదాపుగా ఈ పథకం కోసం ఆశతో ఎదుచూస్తున్నాయి. ఇంటిస్థలం ఉన్నవారు చాలామందే ఉన్నారు. ప్రభుత్వం పేర్కొన్న మార్గదర్శకాల ప్రకారం కావాల్సిన ధృవపత్రాలు సమకూరక పోవడం, దరఖాస్తు సమర్పణకు మూడు రోజులే గడువు ఇవ్వడంతో.. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, స్థానికంగా అందుబాటులో లేని చాలామంది దరఖాస్తు చేసుకోలేకపోయారు.

నియోజకవర్గానికి మూడు వేల చొప్పున...

ఈ పథకం కింద ఆర్థికసాయాన్ని ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మూడు వేల మందికి అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్తగూడెం నియోజకవర్గంలో పాల్వంచ, కొత్తగూడెం మండలాలు మున్సిపాలిటీలుగా ఉన్నాయి. వీటి పరిధిలో ఇల్లు లేని పేదలు చాలామందే ఉన్నారు. నియోజకవర్గంలో ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీ, మైనార్టీలకు 50 శాతానికి తగ్గకుండా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

నిబంధనలు ఇలా..

ఈ పథకం కింద ఆర్థికసాయం పొందాలంటే సొంత స్థలం, ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలి. మహిళలు మాత్రమే దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. మరుగుదొడ్డి, రెండు పడకల గదుల ఆర్సీసీ కప్పుతో కూడిన ఇంటిని లబ్ధిదారుడు తనకు నచ్చినట్లు నిర్మించుకోవచ్చు. నిర్మాణం పూర్తయ్యాక ప్రభుత్వం నిర్దేశించిన గృహలక్ష్మి లోగో తప్పనిసరిగా ఉంచాలి. వితంతు మహిళలకు మంజూరులో ప్రాధాన్యం ఉంటుంది. దరఖాస్తుదారులు ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా తెరవాల్సి ఉంటుంది.

అద్దె ఇంట్లో ఇబ్బంది పడుతున్నాం



ఏడేళ్లుగా అద్దె ఇంట్లో ఇబ్బందులు పడుకుంటూ ఉంటున్నాం. స్థలం ఉన్నవారికి ప్రభుత్వం ఇల్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షలు ఇస్తున్నారని తెలిసి దరఖాస్తు చేసుకున్నా. ఇంటి నిర్మాణానికి సొంత జాగా ఉంది. నాకు ఇల్లు మంజూరు చేయాలి.

– పి.నిశ్వన్ కేసర్, హరిజనవాడ

మరింత గడువు కావాలి



గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు చేసుకునేందుకు మరికొంత గడువు ఇవ్వాలి. వైన్ షాపుల టెండర్లకు 15 రోజుల గడువు పెట్టి గృహలక్ష్మికి మూడు రోజుల గడువు ఇవ్వడం సరికాదు. ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ న్యాయం చేయాలి.

– భూక్యా రాజేష్ రాథోడ్, కోమటిపల్లి

పారదర్శకంగా ఎంపిక



ప్రభుత్వ నిబంధనల ప్రకారం గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపిక ఉంటుంది. పేదలు మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దు. మండల వ్యాప్తంగా 2,345 దరఖాస్తులు వచ్చాయి. ఆహార భద్రత కార్డు ఉండి సొంత ఇల్లు లేనివారిని ఎంపిక చేస్తాం.

– టి.వెంకటలక్ష్మి, ఎంపీడీఓ, సుజాతనగర్

గృహలక్ష్మి పథకం ఎన్నికల కోసమే..



మాట్లాడుతున్న డాక్టర్ శంకర్ నాయక్

ఇల్లెందు: గృహలక్ష్మి పథకం కేవలం ఎన్నికల కోసం తెచ్చిన పథకమే తప్ప, నిజాయితీతో ప్రజలకు మేలు చేసే పథకం కాదని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శంకర్ నాయక్ విమర్శించారు. శుక్రవారం ఇల్లెందులోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గృహలక్ష్మి పథకం దరఖాస్తులకు మూడు రోజులు గడువు పెట్టిన ప్రభుత్వం.. మద్యం దుకాణాలకు మాత్రం 15 రోజులు పెట్టిందన్నారు. దళిత, బీసీ, మైనార్టీ బంధుల వలే గృహలక్ష్మి కూడా బీఆర్‌ఎస్ కార్యకర్తలకే ఇచ్చే అవకాశం ఉందన్నారు. దివంగత సీఎం డాక్టర్ వైఎస్సార్ ఇందిరమ్మ గృహ నిర్మాణం పథకంలో తెల్ల రేషన్ కార్డు దారులందరికీ ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఈ తొమ్మిదిన్నరేళ్ల ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వని ప్రభుత్వం.. గృహలక్ష్మి పథకం దరఖాస్తుకు రేషన్ కార్డు జత చేయాలనటం సిగ్గుచేటన్నారు. ఎన్ని పథకాలు తెచ్చినా 100 రోజుల్లో బీఆర్‌ఎస్ దుకాణం ఖాళీ అవుతుందన్నారు. అభివృద్ధి మంత్రం వల్లిస్తున్న స్థానిక ఎమ్మెల్యే ఇల్లెందుకు తెచ్చిన ఒక్క ప్రాజెక్టు లేదన్నారు. కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు డానియేల్, పులి సైదులు మాట్లాడుతూ ప్రజలను మోసం చేసేందుకే పథకాలు ప్రవేశపెడుతున్నారని విమర్శించారు. జాఫర్, సైదుమియా, ఐజాక్, తోట వెంకటేశ్వర్లు, ఆవుదుర్తి శంకర్, గడ్డి శ్రీను, స్వరూప, నిర్మల, మసూద్, మహమూద్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



మొక్కలు నాటుతున్న క్లబ్ సభ్యులు

పాల్వంచ: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్క రూ కృషి చేయాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్.కేదారేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థాని క ఒడ్డుగూడెంలో క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... పట్టణంలో రోజురోజుకు కాలుష్యం పెరుగుతోందని, దీనివల్ల అనేక వ్యాధులకు గురి కావాల్సి వస్తోందన్నారు. ప ర్యావరణాన్ని అదుపులో ఉంచేందుకు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో వై.సాంబశివరావు, ఎస్‌పీ.నాయుడు, క్లబ్ సెక్రటరీ రేపాక ప్రసాద రావు, ఎండీ.రంజాన్, జి.రంగనాథాచార్యులు, చిట్లూరి రంజిత్, కె.జగన్, వాసం కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

పాల్వంచ: కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో జిల్లాలోని లెప్రసీ నోడల్ అధికారులకు శిక్షణ కార్యాక్రమం నిర్వహించారు. శిరీష మాట్లాడుతూ.. ఇంటింటి సర్వే నిర్వహించి, అందరినీ పరీక్ష చేసి ఎవరికైనా మొద్దుబారిన మచ్చలు ఉన్నట్లయితే గుర్తించి నమోదు చేయాలన్నారు. అనంతరం ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్లకు తెలియజేయాలని చెప్పారు. రోజుకు గ్రామంలో 20 మందికి, పట్టణాల్లో 40 మంది చొప్పున సర్వే చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ఆగస్టు 16 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు వెంకటేశ్వర్లు, గన్యా, లెప్రసీ ఫియోజియోథెరపిస్ట్ జి.భద్రు, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

టేకులపల్లి జంక్షన్‌లో ‘హైవే’ టెన్షన్



టేకులపల్లి సెంటర్‌లో సర్వే చేస్తున్న ఎన్‌హెచ్, రెవెన్యూ సిబ్బంది

టేకులపల్లి: వలిగొండ వయా మహబూబాబాద్, ఇల్లెందు మీదుగా కొత్తగూడెం (ఇల్లెందు క్రాస్‌రోడ్డు) వరకు 930పీ హైవే రోడ్డు నిర్మాణానికి సంబంధించి ప్రజల్లో టెన్షన్ మొదలైంది. శుక్రవారం ఎన్‌హెచ్ ప్రాజెక్టు కన్సల్టెంట్ ఏఈ, సిబ్బంది, రెవెన్యూ శాఖ సర్వేయర్, ఆర్‌ఐల ఆధ్వర్యంలో టేకులపల్లి మండలంలో సర్వే నిర్వహించి మార్కింగ్ చేశారు. గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా 50 చొప్పున, బయట ప్రాంతాల్లో డీజైన్‌ని బట్టి, ఎత్తు పల్లాలు, మూలమలుపులను బట్టి 50–80 అడుగుల వరకు రోడ్డు వెడల్పు చేయనున్నారు. ఇందులో భాగంగా టేకులపల్లి మండలంలో టేకులపల్లి సెంటర్, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు, కారుకొండ క్రాస్‌రోడ్డుల వద్ద రింగ్ రోడ్లు నిర్మించనున్నారు. సులానగర్ నుంచి రాజుతండా(సీతారాంపురం స్టేజీ) మధ్యలో టోల్‌గేట్ నిర్మాణం చేపట్టనున్నారు. తొమ్మిదోమైలు తండా నుంచి బొమ్మనపల్లి వరకు సర్వే చేశారు. హద్దుల వద్ద మార్కింగ్ చేశారు. టేకులపల్లి సెంటర్‌లో కుడి వైపు 50 అడుగులకు, ఎడమ వైపు బోడు రోడ్డులో 80–100 అడుగుల వరకు సర్వే నిర్వహించి మార్కింగ్ చేయడంతో వ్యాపారులు, స్థానికు ఆందోళన చెందుతున్నారు. జంక్షన్ (రింగ్ రోడ్డు) కోసం 80–100 అడుగుల విస్తీర్ణంలో ఎక్కువ శాతం వ్యాపార సముదాయాలు, నివాసాలు కోల్పోవాల్సి వస్తోంది. దీంతో ఈ ప్రాంత వాసుల్లో అలజడి మొదలైంది. ఈ సెంటర్‌లో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది జీవనోపాధిని పొందుతున్నారు. వీరంతా టేకులపల్లి జంక్షన్ సర్వేపై ఆందోళన చెందుతున్నారు. న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ట్రాఫిక్ ఎస్‌ఐ

పాల్వంచ: పాల్వంచ ట్రాఫిక్ ఎస్‌ఐ సీహెచ్. చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చర్ల ఎస్‌ఐగా పనిచేస్తున్న ఈయన ఇటీవల సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. అక్కడి నుంచి పాల్వంచ ట్రాఫిక్ ఎస్‌ఐగా వచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాల్వంచ: నేడు విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గట్టాయిగూడెం, టీచర్స్ కాలనీ, బ్యాంక్ కాలనీ, సీతారాంపట్నం, కరకవాగు, మార్కెట్ ఏరియా, దమ్మపేట సెంటర్, అయ్యప్పనగర్, ఒడ్డుగూడెం, ఇందిరా కాలనీ, జయమ్మ కాలనీ, ప్రశాంత్ కాలనీ తదితర ఏరియాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

రోడ్డు ప్రమాదం..

పాల్వంచరూరల్: జగన్నాథపురం శివారులో బైక్‌పై పాల్వంచకు వస్తున్న హోంగార్డు లక్‌పతిని తోగ్గూడెం వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

భీమ్ సొసైటీ డైరెక్టర్‌గా సర్పంచ్ రేణుక

టేకులపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ కృషితో రూ.కోటి వ్యయంతో ఇల్లెందులో కొమురం భీమ్ భవనం నిర్మించనున్నారు. ఈ భవన నిర్వహణకు గాను ఇల్లెందు నియోజకవర్గం నుంచి ఆరుగురు డైరెక్టర్లను నియమించారు. ఇందులో టేకులపల్లి నుంచి లచ్చగూడెం సర్పంచ్ జోగ రేణుకను ఎన్నిక చేసినట్లు శుక్రవారం ఆమె తెలిపారు.

బీఎస్పీ చేరికల కమిటీ చైర్మన్‌గా రాజేందర్

కొత్తగూడెంఅర్బన్: బహుజన్ సమాజ్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి చేరికల కమిటీ చైర్మన్‌గా గుడివాడ రాజేందర్ నియమితులయ్యారు. స్థానిక ప్యూన్ బస్తీకి చెందిన ఆయనకు శుక్రవారం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ నియామక పత్రం అందజేశారు.

లైంగికదాడికి యత్నం

పాల్వంచరూరల్: ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై లైంగికదాడికి యత్నించిన వ్యక్తితో పాటు అతడి కుటుంబ సభ్యులపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పాతసూరారం గ్రామానికి చెందిన వివాహిత ఇంట్లో ఒంటరిగా ఉండగా ఈ నెల 8న రాత్రి అదే గ్రామానికి చెందిన సుగ్గాల భార్గవ్ లైంగికదాడికి యత్నించాడు. సదరు మహిళ కేకలు వేయడంతో వెళ్లిపోయాడు. ఈ విషయంలో భార్గవ్ తల్లి ఉమ, అమ్మమ్మ విజయమ్మ సైతం మహిళపై దురుసుగా ప్రవర్తించారు. దీంతో సదరు మహిళ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కార్తీక్ తెలిపారు.

సొసైటీ అధ్యక్షుడిగా మళ్లీ వెంకటరెడ్డి



వెంకటరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు, సొసైటీ డైరెక్టర్లు

జూలూరుపాడు: జూలూరుపాడు పీఏసీఎస్ అధ్యక్షుడిగా లేళ్ల వెంకటరెడ్డి తిరిగి బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ఆయనను పదవి నుంచి తొలగిస్తూ తీర్పు వెలువడగా హైకోర్టును ఆశ్రయించడంతో స్టే ఇచ్చారు. దీంతో మళ్లీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా, వెంకట్‌రెడ్డి సభ్యత్వంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ డైరెక్టర్ యల్లంకి సత్యనారాయణ వరంగల్‌లోని తెలంగాణ కోఆపరేటివ్ ట్రిబ్యూనల్ కోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. ఈ పిటిషన్‌పై మూడేళ్ల పాటు వాదనలు సాగగా, వెంకటరెడ్డి సరైన ఆధారాలు సమర్పించలేకపోవటంతో ప్రాథమిక సభ్యత్వం, అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తూ ఈనెల 7న కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు భద్రాద్రి జిల్లా కో–ఆపరేటివ్ ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వరరావు ఉపాధ్యక్షుడైన చీమలపాటి భిక్షంను అధ్యక్షుడిగా నియమించడంతో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇంతలోనే ట్రిబ్యూనల్ తీర్పును వెంకటరెడ్డి హైకోర్టులో అప్పీల్ చేయగా, స్టే విధిస్తూ తీర్పు వెలువడించింది. ఈ మేరకు వెంకట్‌రెడ్డి మళ్లీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించగా పలువురు డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. డైరెక్టర్లు అల్లాడి రజనీ, కల్యాణపు నరేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొడ్డు కృష్ణయ్యతోపాటు ముత్తినేని రామయ్య, వెంగన్నపాలెం దుద్దుకూరి మధుసూధన్‌రావు, దుద్దుకూరి నరసింహారావు, నర్వనేని పుల్లారావు, యల్లంకి చిన్న నాగేశ్వరరావు, పోతురాజు నాగరాజు, మందాబాబు, లకావత్ లచ్చు నాయక్, తాళ్లూరి లక్ష్మయ్య పాల్గొన్నారు.

స్థానిక బ్రిక్స్ ఫ్యాక్టరీలకు బూడిద ఇప్పించండి

పాల్వంచ: స్థానిక బ్రిక్స్ ఫ్యాక్టరీలకు కేటీపీఎస్ నుంచి ఉచితంగా బూడిదను ఇప్పించాలని బ్రిక్స్ ఫ్యాక్టరీల అసోసియేషన్ నాయకులు కోరారు. శుక్రవారం పాత పాల్వంచలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావును కలిసి సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేటీపీఎస్ నుంచి ఉచిత బూడిదను గత మార్చి నుంచి నిలిపివేశారని, ఇటుక తయారీ ముడి సరుకు ధరలు పెరిగాయని, ఉచిత బూడిద నిలిచిపోవడంతో ఫ్యాక్టరీలు నష్టాల బాట పట్టాయని, కార్మికులు ఉపాధి కోల్పోయే అవకాశం ఉందన్నారు. సీఎస్ఆర్ పాలసీ కింద స్థానికుల ఫ్యాక్టరీ యజమానులను ఆదుకోవాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే జెన్కో డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ నెల చివరి వరకు తప్పక వచ్చేలా కృషి చేస్తానని హామి ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షులు కంతాల వెంకన్న, గంగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, విజయ్‌కుమార్, సత్యనారాయణ, మధు, శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

లీగల్ సర్వీసెస్ సేవలు అభినందనీయం



బుక్‌లెట్లు అందజేస్తున్న సతీష్‌ఖండేల్‌వాల్

ఇల్లెందురూరల్: రైతు వేదికలలో లీగల్ సర్వీసెస్ అథారిటీ సేవలు అభినందనీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, సింగరేణి గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్ అన్నారు. మండలంలోని సుదిమళ్ల గ్రామపంచాయతీ రైతు వేదికలో రైతులకు అందిస్తున్న న్యాయసేవలను శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యవసాయాన్ని వృత్తిగా నమ్ముకుని పంట చేలలో పనులు చేసుకుంటున్న రైతులకు న్యాయపరమైన అంశాలను వివరిస్తూ వారిలో చైతన్యం కలిగించేందుకు ప్రభుత్వం రైతు వేదికలలో న్యాయసేవ విభాగాన్ని ఏర్పాటు చేసిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా న్యాయసంబంధిత పుస్తకాలను లీగల్ సర్వీసెస్ వలంటీర్ సతీష్ ఖండేల్‌వాల్ వారికి అందజేశారు.

బేసిక్ వర్క్‌షాపులో అవకాశమివ్వండి



మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఈపీ ఆపరేటర్లు

సింగరేణి(కొత్తగూడెం): ఆరోగ్యం సహకరించకున్నా సింగరేణి యాజమాన్యం ఆదేశాల మేరకు జీకేఓసీలో మూడు షిఫ్టులలో విధులు నిర్వహిస్తున్నామని, బేసిక్ వర్క్‌షాపులో అవకాశం కల్పించాలని గని మేనేజర్‌కు శుక్రవారం ఈపీ ఆపరేటర్లు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉన్న కార్మికులకు ఏళ్ల తరబడి ఒకే దగ్గర జనరల్ షిఫ్టులను కేటాయిస్తున్నారని, ఆరోగ్యం సరిగ్గాలేని వారికి మాత్రం మూడు షిఫ్టులు కేటాయించటం సరైంది కాదన్నారు. మూడు షిఫ్టులలో డ్యూటీలు చేయలేక గైర్హాజరవుతున్నామని, తమ గోడును పరిశీలించి బేసిక్ వర్క్‌షాపులో విధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో లింగాల జోసఫ్, కే.నాగరాజ్, అబ్దుల్ రఫిక్, జన్నుకుమార్, ఓం ప్రకాశ్, జి.రాజశేఖర్, ఈ.సురేష్, జి.రవి, జే.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటేషన్ దందా నుంచి కాపాడండి..

జీకే ఓసీలో పనిచేస్తున్న ఈపీ ఆపరేటర్లను డిప్యూటేషన్ దందా నుంచి కాపాడాలని శుక్రవారం సింగరేణి డైరెక్టర్(పా)కు ఈపీ ఆపరేటర్లు వినతిపత్రం అందజేశారు. గనిలో బొగ్గునిక్షేపాలు పూర్తయిన నేపథ్యంలో ఇక్కడ పనిచేసే ఈపీ ఆపరేటర్లు జూనియర్స్ ఉండగా, సీనియర్లు అయిన తమను డిప్యూటేషన్ పేరుతో మణుగూరుకు బదిలీ చేయడం సరికాదని విన్నవించారు. స్పందించిన డైరెక్టర్(పా) మీ సమస్యలను ఏరియా అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

16 నుంచి సమ్మె



ర్యాలీ నిర్వహిస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రెండో ఏఎన్‌ఎంల సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 16 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శుక్రవారం ప్రదర్శన నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. 16 సంవత్సరాలుగా ప్రభుత్వానికి ఊడిగం చేస్తున్నా ఉద్యోగ భద్రత, కనీస వేతనాలను అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రధాన సమస్య అయిన ఉద్యోగుల క్రమబద్ధీకరణ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని స్పందించకపోతే నిరవధిక సమె తప్పదని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు జర్పుల ఉపేందర్, రెండో ఏఎన్‌ఎం నాయకురాళ్లు సజ్జు బేగం, వంక పుష్ప, సొందె పూర్ణ, నారం రాములమ్మ, భూక్యా జ్యోతి, అరుణ, గుగులోత్ శాంతి, కొమరం ఈశ్వరి, సరస్వతి, రమణ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

అటవీ అధికారులకు కొండచిలువ అప్పగింత

ఇల్లెందురూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం స్థానికులు పది అడుగుల కొండ చిలువను పట్టుకొని అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. గ్రామంలో కొండ రాధిక ఇంటి వెనుక ఖాళీ స్థలంలోకి వచ్చిన కొండ చిలువ కోడిని పట్టుకోవడాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు గట్టిగా కేకలు వేశారు. గ్రామానికి చెందిన నాయిని రాజు, తడిక సదానందం, సాయి, నికిల్, శ్రీధర్ తదితరులు అక్కడకు చేరుకొని చాకచక్యంగా కొండచిలువను ప్రాణాలతో పట్టుకున్నారు.

గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో అక్కడకు చేరుకున్న అటవీశాఖ అధికారులు కొండచిలువను స్వాధీనం చేసుకొని అటవీప్రాంతంలో వదిలేశారు.



అటెన్షన్ ప్లీజ్

అన్నదాతలను ఆదుకునేదెవరు ?

ఇల్లెందు మండలం బోయితండా గ్రామపంచాయతీ సర్వే తండాలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా అయ్యే ట్రాన్స్‌ఫార్మర్ నెల రోజుల క్రితం కాలిపోయింది. మరమ్మతులు చేయాలని రైతులు ఎంత మొరపెట్టుకున్నా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో వరినాట్లు, నాటుకు సిద్ధంగా ఉన్న నారుమడులు, మొలకెత్తిన మొక్కజొన్న, మిర్చి పంటలు ఎండిపోతున్నాయి. అధికారులు తక్షణం స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ బాగు చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

– ఇల్లెందురూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : రవి, ఏఈ, ఇల్లెందు
సెల్‌నెంబర్: 9440814146